నమస్తే తెలంగాణ
# ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ సోమవారం 23 జూన్ 2025 | ADILABAD NIRMAL



బోథ్‌లోని సీహెచ్‌సీ దవాఖాన

## బోథ్‌లో ఇద్దరే దిక్కు

బోథ్, జూన్ 22 : బోథ్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)లో ఇద్దరు వైద్యులే దిక్కయ్యారు. డాక్టర్ల కొరతతో వైద్య సేవలపై ప్రభావం పడనుంది. నియోజకవర్గ కేంద్రమైన బోథ్‌లోని 30 పడకల ఆసుపత్రిని వంద పడకల దవాఖానగా అప్‌గ్రేడ్ చేశారు. కొత్త భవన నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేసింది. భవన నిర్మాణ పనులు ప్రస్తుతం చివరి దశకు చేరుకున్నాయి. అప్‌గ్రేడ్ కాక ముందు నుంచి ఇక్కడ ఆరుగురు డాక్టర్ల పోస్టులు మంజూరై ఉన్నాయి. ప్రస్తుతం ఇద్దరు డాక్టర్లు మాత్రమే పని చేస్తున్నారు. ఉట్నూర్‌లో స్పెషలిస్టు డాక్టర్‌గా పని చేస్తున్న డాక్టర్ ఆర్ రవీంద్ర ప్రసాద్‌ను ఇక్కడ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా నియమించారు. ఇటీవల ఆయన డిప్యూటేషన్‌ను రద్దు చేసి ఉట్నూర్‌లో పని చేస్తున్న రవికుమార్‌ను బోథ్ సీహెచ్‌సీ సూపరింటెండెంట్‌గా నియమించారు. విధుల్లో చేరిన మరుసటి రోజు నుంచి ఆయన సెలవుపై వెళ్లారు. ఉట్నూర్‌కు బదిలీ అయిన డాక్టర్ రవీంద్రప్రసాద్ సెలవు పెట్టారు. ప్రస్తుతం వర్షాకాలం మొదలవడం, సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉండడంతో బోథ్ దవాఖానకు చికిత్స నిమిత్తం వచ్చే వారికి సరైన వైద్యం అందే పరిస్థితులు కనిపించడం లేదు. నిత్యం ఓపీకి వందలాది మంది రావడంతోపాటు 24/7 సేవలు అందించాల్సి ఉండడంతో ప్రస్తుతమున్న ఇద్దరు డాక్టర్లకు పనికి మించి భారమయ్యే పరిస్థితులు నెలకున్నాయి. మరో వైపు వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ అయిన దృష్ట్యా కావాల్సిన క్యాడర్ స్ట్రెంత్‌ను నియమించాల్సి ఉంది. ఎక్స్‌రే, ఐసీయూ వంటి పరికరాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. వెనుకబడిన బోథ్ ప్రాంతంలో మెరుగైన వైద్య సేవల కోసం సీహెచ్‌లో అవసరమైన డాక్టర్, ఇతర సిబ్బందిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు. బోథ్ సీహెచ్‌సీ సూపరింటెండెంట్‌గా విధుల్లో చేరిన నాటి నుంచి హెల్త్ కమిషనర్, సెక్రెటరీ, కలెక్టర్ల దృష్టికి తీసుకెళ్లి ఇతర ప్రాంతాల నుంచి డాక్టర్లను డిప్యూటేషన్‌పై ఇక్కడికి వచ్చేలా చేసి వైద్య సేవలకు ఇబ్బందులు కలుగకుండా చూశానని డాక్టర్ రవీంద్రప్రసాద్ తెలిపారు.


నిర్మాణంలో ఉన్న సీహెచ్‌సీ నూతన భవనం

ప్రభుత్వ దవాఖానల్లో వైద్యుల కొరత వేధిస్తున్నది. రోగులకు సరిపడా వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులైన విషజ్వరాలు, మలేరియా, డెంగీ వ్యాధులు ప్రబలుతుండడంతో ఇబ్బంది అవుతున్నది. దవాఖానలు వ్యాధిగ్రస్తులతో నిండిపోతున్నాయి. ఇప్పటికైనా అన్ని ప్రభుత్వ దవాఖానల్లో వైద్యులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.


ఉట్నూర్‌లోని జిల్లా ప్రభుత్వ దవాఖాన

# వైద్యులేరీ?

- ప్రభుత్వ దవాఖానల్లో వేధిస్తున్న సిబ్బంది కొరత
- వైద్య సేవలకు ఆటంకం.. అవస్థలు పడుతున్న రోగులు..
- సిబ్బందిని నియమించాలని వేడుకుంటున్న ప్రజలు

ఉట్నూర్ రూరల్, జూన్ 22 : ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్‌లో గల ప్రభుత్వ దవాఖాన జిల్లాలోనే రెండో అతిపెద్దది. ఉట్నూర్, నార్నూర్, గాదిగూడ, ఇంద్రవెల్లి, జైనూర్, సిర్పూర్(యూ), లింగాపూర్ మండలాల ప్రజలకు అత్యవసర వైద్యం అందించడానికి 2019లో జిల్లా దవాఖానగా మార్చారు. విషజ్వరాలు, మలేరియా, డెంగీ వ్యాధులు ప్రబలినప్పుడు వైద్యం అందించడానికి రూ.13.50 కోట్లతో నూతన భవనం నిర్మించి 50 పడకల నుంచి 100 పడక దవాఖానగా మార్చారు. కానీ.. వైద్య సిబ్బంది కొరత వెక్కిరిస్తుంది.

### సిబ్బంది కొరత

దవాఖానలో మొత్తం 48 మంది సిబ్బంది ఉండాలి. కానీ.. కేవలం 22 మందితో కాలం వెళ్లదీస్తున్నారు. సర్జన్, జనరల్ సర్జన్, ఆర్థో, అనస్థీషియా వంటి స్పెలిస్ట్ పోస్టులు ఖాళీ ఉన్నాయి. 14 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా.. కేవలం ఏడుగురితో కాలం వెళ్లదీస్తున్నారు. గతంలో నేషనల్ హెల్త్ మిషన్ కింద 19 మంది సిబ్బంది ఉండగా.. వారు ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. ప్రస్తుతం ఆరుగురు మాత్రమే పని చేస్తున్నారు. ఐసీయూ మంజూరు అయినప్పటికి సిబ్బంది లేక పనిచేయడం లేదు. కంటి వైద్య నిపుణులు ఉన్నా పరికరాలు లేక వైద్యం అందడంలేదు. ప్రభుత్వం రోగులకు తక్షణ వైద్యం అందించుటకు నూతనంగా రక్త పరీక్షల కొరకు టీ-హబ్ ఏర్పాటు చేసిన 15 మంది సిబ్బంది అవసరమున్న ఇప్పటివరకు ఎవరిని నియమించలేదు. ఇక 2018లో చిన్న పిల్లలకు వైద్యం అందించడానికి ఏసీహెచ్ కొరకు రూ.17 కోట్లు మంజూరు కాగా.. ఇప్పటి వరకు దాని గురించి పట్టించుకున్న నాథుడే లేడు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఉట్నూర్‌లోని జిల్లా ప్రభుత్వ దవాఖానపై దృష్టిసారించి పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించి సకాలంలో వైద్యం అందించాలని ప్రజలు కోరుతున్నారు.


దవాఖానలో చికిత్స పొందుతున్న రోగులు




### ఉన్నతాధికారులు, ప్రభుత్వానికి నివేదికలు పంపించాం..



దవాఖానలో సిబ్బంది కొరత వాస్తమే. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడానికి కృషి చేస్తున్నాం. వైద్యులు, సిబ్బందిని నియమించాలని ఉన్నతాధికారులు, ప్రభుత్వానికి నివేదికలు పంపించాం. సిబ్బంది కొరత ఉన్న ప్రస్తుత వైద్యులు కొంత ఎక్కువ సమయం పని చేస్తున్నారు. రోగులకు ఇబ్బందులు కలుగకుండా వైద్యం అందిస్తున్నాం. పూర్తి స్థాయి సిబ్బంది నియమిస్తే ప్రజలకు త్వరగా వైద్యం అందుతుంది.

*- ఉపేందర్, సూపరింటెండెంట్, దవాఖాన.*

## బీఆర్‌ఎస్‌లో చేరిన బీజేపీ యువకులు


యువకులకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న జోగు రామన్న

ఎదులాపురం, జూన్ 22 : కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు యువకులు, విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని, బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని చూసి యువత పార్టీలో చేరేందుకు వస్తున్నారని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో రణదివేనగర్‌కు చెందిన పలువురు కపిల్, రాజు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి జోగు రామన్న గులాబీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ అధికారంలోకి ఇచ్చి ఏడాదిన్నర అవుతున్న యువత, విద్యార్థుల కోసం కార్యక్రమాలు చేపట్టలేదన్నారు. తెలంగాణలో మళ్లీ కేసీఆర్ పాలన వస్తుందని భావించి నేడు డిగ్రీ విద్యార్థులు, యువకులు పార్టీలో చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు అజయ్, శివకుమార్, కుమ్ర రాజు, జగదీశ్, కొండ గణేశ్ పాల్గొన్నారు.

## వర్షం కోసం పూజలు

***కన్నగుట్ట, పొచ్చెర గ్రామాల్లో*** *ఆదివారం వానదేవుడు కరుణించాలని వేడుకుంటూ పూజలు చేశారు. కన్నగుట్టలో డప్పులు, భాజాలతో కప్పతల్లి ఆడారు. గ్రామదేవతల విగ్రహాలకు నీళ్లు పోశారు. పొచ్చెరలో కొంకన్న గుట్టపై కొలువై ఉన్న కొంకన్న దేవుళ్లకు పూజలు చేశారు. వరద పాశం వండి పెట్టారు. ఈ కార్యక్రమాల్లో కుమ్మరి పెద్ద చిన్నయ్య, మునిగెల రమేశ్, మునిగెల ఎల్లయ్య, నల్ల చిన్నయ్య, అన్నెపాగ అశోక్, కుమ్మరి నారాయణ, సంతోష్, నవీన్ పాల్గొన్నారు.*

*- బోథ్, జూన్ 22*


కన్నగుట్టలో కప్పతల్లి అడుతున్న గ్రామస్తులు

## మురిపించి.. ముఖం చాటేసి..

- పక్షం రోజులైనా కరుణించని వరుణుడు
- ఎండలకు భూమిలోనే మాడిపోతున్న విత్తనాలు
- చినుకు జాడలేక ఆందోళనలో రైతులు

**ఈ యేడాది రోహిణి కార్తేకు** ముందే రుతుపవనాలు పలకరించాయి. దీంతో రైతులు సంతోషంగా విత్తనాలు విత్తారు. ముందస్తుగానే వేలాది ఎకరాల్లో పత్తి, సోయాతోపాటు వివిధ రకాల పంటలు వేశారు. కానీ.. పక్షం రోజులుగా వరుణుడు కరుణించకపోవడంతో విత్తనాలు భూమిలోనే మాడిపోతున్నా యని రైతులు ఆందోళన చెందుతున్నారు. మే మూడో వారంలో వర్షాలు కురవడంతో విత్తనాలను నాటారు. సాధారణంగా నాటిన వారం రోజులకు విత్తనం మొలకెత్తాలి. కానీ.. విత్తనం మొలకెత్తడం లేదు. సాధారణంగా వర్షాకాలం సాగు మృగశిర కార్తే అనంతరం మొదలవుతుంది. మృగశిర కార్తే రాకతో వాతావరణం చల్లబడుతుంది. ఆ వాతావరణంలో విత్తనం పడితే దిగుబడి బాగా వస్తుంది. ప్రస్తుత పరిస్థితులు దానికి భిన్నంగా ఉన్నాయి. 15 రోజులుగా ఎండలు దంచి కొడుతున్నాయి. దిగుబడి రావాలంటే విత్తన దశలో వాతావరణం అనుకూలించాలి. గడిచిన 15 రోజుల్లో కనీసం ఒక్కవాన కురవలేదని రైతులు అంటున్నారు. *- భైంసా, జూన్ 22*


పక్షం రోజుల క్రితం విత్తనాలు విత్తుతున్న రైతులు

## హరితహారం చెట్లు నరికివేత

***ఖానాపూర్ మండలంలోని*** *దిలావర్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల మసీదు ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు మూడు చెట్లను నరికివేసి పొలంలో పడేశారు. గతేడాది కూడా అదే రోడ్డు వెంబడి మూల మలుపు వద్ద నాటిన చెట్లను నరికివేసిన ఘటనలు ఉన్నాయి. యేటా ఘటనలు పునరావృతం అవుతున్నా.. అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. గ్రామస్తులు, ప్రకృతి ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు. చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.*

*- ఖానాపూర్ రూరల్, జూన్ 22*


దిలావర్‌పూర్‌లో నరికివేతకు గురైన హరితహారం చెట్లు

## అంధకారంలో వివేకానంద చౌక్

**కుభీర్ మండల కేంద్రంలోని** ప్రధాన రహదారిలో గల వివేకానంద చౌక్‌లో రాత్రి వేళ చీకట్లు కమ్ముకుంటున్నాయి. రోజు వందలాది మంది ప్రయాణికులు ఈ చౌక్‌లోనే బస్సు దిగి పల్సి, పార్డి(కె), పార్డి(బీ), రాజురా, జుమ్డ, కస్ర, కస్ర తాండ, పార్డి(కె) తండాలకు వెళ్తుంటారు. ఇక్కడ సుమారు 50కి పైగా ఊర కుక్కలు ఉంటాయి. బస్సు దిగగానే చిమ్మ చీకట్లో కుక్కలు అరవడంతో మహిళలు, ప్రయాణికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. రెండున్నర ఏండ్ల క్రితం ఈ చౌక్‌లో మినీ హైమాస్టు లైట్లు ఏర్పాటు చేశారు. మరమ్మతులు లేక వెలగడం లేదు. అధికారులు స్పందించి రాత్రి వేళలో లైట్లు వెలిగేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. *- కుభీర్, జూన్ 22*

కుభీర్‌లోని వివేకానంద చౌక్‌లో కమ్ముకున్న చీకట్లు



## మైనర్ బాలికపై లైంగిక వేధింపులు

- ఎనిమిది మంది రిమాండ్
- వీరిలో ఇద్దరు మైనర్లు
- గుడిహత్నూర్ పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసు నమోదు
- ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్

గుడిహత్నూర్, జూన్ 22 : మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన యువకులపై గుడిహత్నూర్ మండల పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసు నమోదు చేసినట్లు ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్ పేర్కొన్నారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. మైనర్ బాలికతో చిన్న నాటి స్నేహితుడు చాటింగ్ చేసేవాడు. ఈ క్రమంలో నగ్నంగా వీడియో కాల్ చేయించి రికార్డు చేశాడు. ఆ వీడియోను తన స్నేహితులకు పంపించి లైంగికంగా, మానసికంగా వేధించారు. దీంతో ఈ ఎనిమిది మందిపై కేసు నమోదు చేశామని తెలిపారు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు సజ్జన్‌వార్ వంశీకృష్ణ, పవార్ తరుణ్, సాబ్లె బాలవంత్‌సింగ్, గుండల్వార్ వరుణ్, కరాడ్ సుధీర్, ముర్కుటే వితల్‌తోపాటు ఇద్దరు మైనర్లపై పోక్సో కింద కేసు నమోదు చేశామని తెలిపారు. మహిళలు షీ టీం నిరంతరం సహకరిస్తుందని, అత్యవసర సమయంలో ఫోన్ నంబరు 8712659953 చేసి సంప్రదించాలన్నారు.

## అడ్మిషన్ దరఖాస్తుల ప్రక్రియ పూర్తి

### 20,258 దరఖాస్తులు వచ్చాయి : వీసీ

బాసర, జూన్ 22 : బాసర ఆర్జీయూకేటీలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఇంటిగ్రేటెడ్ కోర్సులో ప్రవేశాల ప్రక్రియకు సంబంధించి దరఖాస్తుల ప్రక్రియ పూర్తి అయిందని ట్రిపుల్‌ఐటీ వీసీ గోవర్ధన్ తెలిపారు. బాసర, మహబూబ్‌నగర్ సెంటర్లలో మొత్తం 20,258 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. వీరికి జూలై 4వ తేదీన అర్హులైన వారికి సీట్లను కేటాయింపు, ఫలితల విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. తదుపరి జూలై 7వ తేదీ నుంచి మొదటి విడుత కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుందన్నారు.